క్లుప్తంగా

మాయమవుతున్న గ్రిల్స్

పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు అభివృద్ధిలో భాగంగా రక్షణ వలయం కింద హెచ్ఎండీఏ అధికారులు చెరువు కట్ట చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి బిగించిన ఇనుప గ్రిల్స్‌లు కొంత కాలం నుంచి మాయమౌతున్నాయి. ముఖ్యంగా బతుకమ్మ ఘాట్ వద్ద మెట్లు దిగి లోపలకి పోయే ప్రదేశంలో ఏర్పాటు చేసిన గేట్లను అపహరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వీటిని మాయం చేస్తున్నారు. ఇప్పటి వరకూ రెండు గేట్లను అపహరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లక్షల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన అభివృద్ధి పనుల సామగ్రిని పరిరక్షించాలన్నారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం మందిరంలో మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు మహేశ్వరం ఎమ్మెల్యే హాజరు కానున్నారని తహసీల్దార్ పేర్కొన్నారు. అనంతరం మహేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ నుంచి జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీ వరకు నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను బుధవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాలనీ వాసులు జితేందర్ రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి ప్రతిష్ఠాపన వేడుకలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠాపన నవమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. అమ్మవారికి 108 కలశములతో అష్టోత్తర స్నాపన పంచామృత అభిషేకం, హోమం, పూర్ణాహుతి, 108 మంది మహిళలచే సామూహిక కుంకుమార్చన, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళల కోలాటాలు, భజనలతో వనస్థలిపురం వీధుల్లో అమ్మ వారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేముల జయరాములు, ప్రధాన కార్యదర్శి అల్లాడి లక్ష్మీనారాయణ, కోశాధికారి గుంతా వెంకటస్వామి, ఆర్యవైశ్య సంఘం నాయకులు చింతల రవికుమార్, తడకమళ్ల రవికుమార్, జగదీశ్వర్, ప్రధాన అర్చకులు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీలలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. కాలనీ వాసులు సమష్టిగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, కాలనీల నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెనడాలో ఆకట్టుకున్న నగర నాట్య కళాకారిణి ప్రదర్శన

దేవులపల్లి సుమాలికకు తనికెళ్ల భరణి ప్రశంసలు

దిల్‌సుఖ్‌నగర్: కెనడలో ఒంటారియో తెలుగు ఫౌండేషన్ (ఓటీఎఫ్) ఆధ్వర్యంలో టొరంటో గ్రాండ్ సినమాన్ బాంకెట్ హాల్‌లో సంగీతం, పద్యం, సాహిత్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు కమ్యూనిటీ బంధుమిత్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన సవ్యసాచి రెండు చేతులతో ఏక కాలంలో రాయగల దిట్ట, కూచిపూడి నందు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధకురాలు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత, ఓటీఎఫ్ ఉగాది స్ఫూర్తి పురస్కార గ్రహీత కుమారి దేవులపల్లి సుమాలిక భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులని మైమరిపించిందని సుమాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి సుమాలికను అభినందిచారు.

జీరో బిల్లుకు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీఓ సరిత


కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేస్తున్న లబ్ధిదారులు

కందుకూరు: గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లు రాని లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాయలంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకూ లబ్ధిదారుల నుంచి గృహజ్యోతితో పాటు వివిధ పథకాల అమలునకు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో చాలా మంది వివరాలు సక్రమంగా చేయకపోవడంతో చాలా మంది అర్హులకు జీరో బిల్లులు జారీ కాలేదు. దీంతో వారంతా ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మరోసారి దరఖాస్తులు చేసుకుంటున్నారు.

రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి...

జీరో విద్యుత్ బిల్లుతో పాటు రూ.500 గ్యాస్ సిలిండర్ రాని వారి కోసం ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేశామని ఎంపీడీఓ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ బిల్లు, గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, మొబైల్ తీసుకొచ్చి ఓటీపీ ద్వారా దగ్గర ఉండి వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

బల్దియాలో విలీనం చేయొద్దు

- బీజేపీ అందెల శ్రీరాములు, తూళ్ల వీరేందర్‌గౌడ్ డిమాండ్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని బీజేపీ రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, తూళ్ల వీరేందర్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశంకు కౌన్సిలర్లు, నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే అభివృద్ధి పూర్తిగా కుంటు పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేఖిస్తుందన్నారు. మున్సిపాలిటీలో తమ పార్టీ బలంగా ఉండటంతో కాంగ్రెస్ నాయకులు కుట్రతోనే ఈ సాహసానికి సిద్ధమయ్యారన్నారు. కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కె. మధు మోహన్, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, రాజు, విలాస్, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్‌ప్లేట్ల పంపిణీ


ప్లేట్లు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత, శ్రీనివాస్‌రెడ్డి

బడంగ్‌పేట్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 23వ డివిజన్ కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషి శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ చిగురింత పారిజాత స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. 400 మంది విద్యార్థులకు సరిపడ రూ.35 వేలతో నాణ్యమైన స్టీల్ ప్లేట్లను సంతోషి శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా పాఠశాలకు అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ పారిజాత మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయుల సూచనలు, సలహాలతో మంచి మార్కులు తెచ్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించే బాధ్యత మాపై ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని చదువును నమ్ముకుని ముందుకు సాగిన వారే విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్టు బాలకృష్ణ, విజయ్‌కుమార్, కుమార్, అమృత నాయుడు, నయనాచారి, సామ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కందుకూరులో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు

రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం

నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యాలయాల్లో, రాజకీయ నాయకులు, ప్రతినిధులు రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. పేదల కష్టాలు తెలుసుకోవడం కోసం 6వేల కిలో మీటర్ల మేర పాదయాత్రచేశాదని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, కాబోయే భావి భారత ప్రధాని అని రాహుల్‌గాంధీని కొనియాడారు.


మీర్‌పేట కూడలిలో చల్లా నర్సింహరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి


బడంగ్‌పేట్: శానిటేషన్ సిబ్బందికి పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి


మహేశ్వరం: మండల కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్లక్ష్యం వహిస్తే సహించం

చంపాపేట: సర్కిల్ శానిటేషన్ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బీఎన్‌రెడ్డి డివిజన్ కారొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హెచ్చరించారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. పేరుకుపోయిన చెత్తకుప్పలు, మురుగు సమస్యను పరిశీలించారు. వెంటనే శానిటేషన్ సిబ్బందిని పిలిపించి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో సర్కిల్ సిబ్బంది నరేంద్ర, అజీముద్దీన్, రామ్‌చందర్, సంజీవరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కర్ణంగూడ- పోచారం రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం–నాగర్జునసాగర్ హైవే నుంచి కర్ణంగూడ, ఎలిమినేడు, పోచారం, మంగల్‌పల్లి వరకు నూతనంగా నిర్మించిన ఆర్అండ్‌బీ రహదారిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నగరానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం రూపురేఖలను మార్చివేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి పనితీరు అధ్వానంగా మారిందని, త్వరలో ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ నరేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాచారం మండలానికి మహర్దశ..

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి కృషితో యాచారం మండలానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, కేస్లీతండాలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... యాచారం మండలంలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన కంపెనీల ఏర్పాటుకు సర్కార్ సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. వాటిలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్ నాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 70, వంకాయ 35, బెండ 50, పచ్చి మిర్చి 80, కాకర 65, బీర 72, క్యాబేజి 25, ఫ్రెంచి బీన్స్ 175, క్యారెట్ 40, దొండ 41–45, చిక్కుడు 75, గోకర 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 80, ఆలు 35, దోస 27, సొర 17, పొట్ల 20, ఉల్లిగడ్డ 35, చామగడ్డ 35. గమనిక: ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చెత్తను తొలగించరా?

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలల్లో ఉన్న పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించడానికి అధికారులు చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. డివిజన్ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో గల పార్కులో కొంతకాలంగా కుప్పలు తెప్పలుగా చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించడంలో సంబంధిత శాఖ అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్: హయత్‌నగర్ మండల వ్యాప్తంగా అనుమతిలేని పాఠశాలలు, జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా నిర్మాణాలు పూర్తికాని భవనాల్లో పాఠశాలలు కొనసాగిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. పాఠశాలలో నోటు పుస్తకాలు, డ్రస్సులు, స్కూల్‌బ్యాగ్స్ అమ్ముతున్న హయత్‌నగర్ బొమ్మలగుడి సమీపంలోని కాకతీయ స్కూల్, గౌతమ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా జీహెచ్ఎంసీ అనుమతి లేని భవనంలో తరగతులు కొనసాగిస్తున్నారని అన్నారు. మండల విద్యాధికారి ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గ్యార క్రాంతి, సహాయ కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు వెంకటేశ్, బన్నీ, భాను, లక్ష్మణ్, గణేశ్, భరత్, నాగరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని 2, 13వ వార్డుకు చెందిన జయమ్మ, పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ.8 వేల ఆర్థికసాయం అందించడంతో పాటు క్వింటాల్ బియ్యం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు బుచ్చయ్య, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..

తలకొండపల్లి: పదోతరగతి వరకు తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలవడంతో అతడికి వారంతా అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన శ్రీనుకు ఇటీవల బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు అతడికి రూ.52,500 ఆర్థికసాయం అందజేశారు. మిత్రులు రవీందర్, అజీమ్, శ్రీశైలం, విష్ణు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ


పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిన రాఘవేందర్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు దేశారం రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నోట్ పుస్త కాలు, బ్యాగులు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయురాలు సవి త, అంగన్‌వాడీ టీచర్ ప్రభావతి పాల్గొన్నారు.

జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

మంచాల: విద్యతోనే మార్పు సాధ్యమని యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. బుధవారం మంచాల మండలంలోని జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోనే ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు వస్తుందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, టీచర్లకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నత్తనడకన వరద నాలా పనులు

- సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- ప్రమాదకరంగా తవ్విన గుంతలు
- భయం..భయంగా ముంపు కాలనీలు
- పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు


కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీ మధ్యలో వదిలేసిన బాక్స్ టైపు వరదనీరు నాలా పనులు

నాగోలు: కొత్తపేటలో సకాలంలో పూర్తి కావాల్సిన వరద నాలా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అసలే వర్షాకాలంతో పై కాలనీల నుంచి వచ్చే వరద నీరు దిగువన ఉన్న కాలనీ వాసులు మరోసారి తమకు ముంపు తప్పదని భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ)లో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కొత్తపేట డివిజన్‌లో గాయత్రిపురం నుంచి మూసీ వరకు వరద ముంపు శాశ్వత నివారణకు వరద నాలా అభివృద్ధి పనులను మూడు సంవత్సరాల క్రితం నాటి ప్రజాప్రతినిధులు మొదలు పెట్టారు. వర్షకాలం లోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్ ముందే చెప్పినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగ ఉంది. గత సంవత్సరం జూన్ నాటికి వరద నాలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు వరద నీరు వెళ్లే బాక్స్ టైప్ పనులు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. జీహెచ్ఎంసీ ఇంజనీర్లు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు, మూడేళ్లలో కురిసిన భారీ వర్షాలకు ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట డివిజన్‌లో ఎస్ఆర్ఎల్ కాలనీ, బృందావన్ కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీ, సత్యనగర్‌కాలనీతో పాటు పలు కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున బాక్స్ టైపు వరద నీరు డ్రైనేజీల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టింది.

గుంతలు తవ్వి వదిలేశారు

బృందావన్ కాలనీలో బాక్స్ డ్రైయిన్ కోసం తీసిన గుంతలు అలాగే వదిలేయడంతో ప్రమాదకంగా మారాయి. ఎస్ఆర్ఎల్ రోడ్డు మీద కూడ పెద్ద గుంతలు తీసి వదిలేశారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్‌కాలనీలో నతనడక నడుస్తున్న బాక్స్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి. పనులు పూర్తి కాకుంటే వర్షాకాలంలో పై నుంచి వచ్చే వరదతో కింది కాలనీ పూర్తిగా ముంపునకు గురవుతాయి. అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలి.

– సురేశ్, కొత్తపేట